శ్రీకాకుళం

# కలలో జారిన కన్నీరు

మొగ్గవిడి పువ్వవుతుంది; గడ్డిమీద మంచుకణం కరిగిపోతుంది. నదిలో పిల్లి కెరటం లాపిడికి వొడ్డున రాయి కరిగిపోతుంది. ఇవేవీ మనం చూడం. ప్రకృతిలో జరిగే మార్పులు ఎప్పుడు, ఎట్లా జరుగుతాయో మనకి తెలీదు కాని మార్పు జరిగిందని గుర్తిస్తాం. మానవుడిలో కాలం తెచ్చే మార్పు మానవుడికి తెలీదు— అంతే, మార్పుల ఫలితం ప్రవర్తనలో చూడం. మంచికైతేనేం చెడ్డకైతేనేం మనలో ఫలానామార్పు జరిగిందని ఇతరులు మనకి తెలియజేస్తే మనసులో కాస్త చికాకుపడతాం, మనిషి మార్పు కాంక్షిస్తాడంటారు—నిజంగా అతను కాంక్షించేమార్పు బాహ్యజగత్తులోనే కాని తనలో కాదు.

కోదండరామయ్య ఆ రాత్రి అట్లాంటిమార్పు తన భార్యలో చూసి బాధపడ్డాడు. పదకొండు దాటింది. ఇంకా చదువుదామనుకుంటుండగా కిటికీ లోంచి మెల్లగా వీస్తూవున్న గాలి పెద్దదయి పుస్తకంలోని పుటలను కదులుస్తోంది. వాటిని సర్ది పుస్తకం మూసేసి బెడ్‌రూమ్‌లాంప్‌కోసం వెదికాడు. ఆతనికి నవ్వొచ్చింది. బెడ్‌రూమ్‌దీపం ఏ మారుమూలో చీకట్లో వుంటుందనిపిస్తుంది. ఎదురుగా బల్లమీద వుంది దీపం వెలిగించాడు. అనసూయకి దీపంవుంటే నిద్రపట్టదు. తనకి లేకుంటే నిద్రపట్టదు. ఎట్లా? గోడపైన మూలగా తగిలించి చుట్టూ ఎర్రకాగితం అమర్చి, వుండీవుండనట్లుగా ఏర్పాటు చేసి చీకటిరాత్రుళ్ళు గడపటం ఉభయులకీ సమ్మతం. స్విచ్ నొక్కి ఎలక్ట్రిక్‌దీపం ఆర్పేశాడు. బెడ్‌రూమ్‌లాంప్ ఎలక్ట్రిక్ దీపం సంతానంలా తల్లికోసం తన్నుకులాడి తేరుకుంది. కొంచెం పెద్దదిచేసి అనసూయ మొహాన చూసాడు. రోజూ వారిద్దరిమధ్య జరిగేదీ యీ హాస్యకాండ. ఆ దీపం వెలుగు ఆమె కనురెప్పలమీద కదలగానే, ఎంతనిద్రలో వున్నా మేలుకోడం "అబ్బ—ఆర్పేద్దురూ, మీకు పుణ్యంవుంటుంది." అని ఆవులింతలో అస్పష్టంగా అని వొళ్ళు వొయ్యారంగా విరుచుకుని అటు తిరిగి పడుకోవడం నిత్యసంబరం.

దీపంకాంతి ఆమె మొహంమీద పడింది. పాపం వెఱ్ఱిది. గాఢమైన నిద్రలో వుంది. పగలల్లా చాకిరీచేసి అలిసి వొళ్ళు మరిచి నిద్రపోతోంది. గాలిజోరుకి పమిట తొలిగి అతని మొహంమీద పడుతోంది. అటు వైపు మడిచిన దుప్పటి అంచుని లేపి ఆమెవక్షంపై కప్పుతోంది. గాలి తలవెండ్రుకలు నుదిటి మీదకి జారి కళ్ళని కప్పేశాయి ముంగురులను మెల్లగా కళ్ళమీదనుండి తొలిగించాడు. ఎన్నడూ చూడని దృశ్యం చూశాడు కోదండరామయ్య. ఆమె కనురెప్పలకిందనుండి కన్నీరు ముత్యా లలా జారి చెక్కిలిమీదనుండి పడడం అతనికి కనిపించింది. నిజంగానా? కన్నీరేనా? మరోసారి చూడ్డం కోసం దీపం మరికొంచెం పెద్దదిచేశాడు. వల్లకాదన్నట్లుగా గాలి వొక్కకసురుతో దీపం ఆర్పేసింది. అతను బైట కొచ్చేశాడు.

బైట వరండాలో పడకకుర్చీలో కూర్చుని గాలి రోడ్డు మీది చెత్తా చెదారంని కదిలిస్తూ, సర్దుతూ వీస్తున్న దృశ్యం చూస్తున్నాడు. అతనికి ఆశ్చర్యంవేసింది. గాలి ఎక్కడనుండి ప్రారంభమౌతుంది ఎటు వీస్తుంది? దానికి గమ్యస్థానం ఉందా? కన్నీరు అంతే—ఎక్కడ, ఎందుకు ఎల్లా కారుతుంది? అతను అప్పుడు చదువుతున్న గ్రంథంలో కన్నీటిని గురించి ఒక అధ్యాయం వుంది అదే చదివి, గ్రంథంమూసేసి, పడుకోటానికి సిద్ధ పడేటప్పటికి అనసూయ నిద్రలో కన్నీరు జారడం దృశ్యం చూడ్డం జరి గింది. జర్మన్‌తత్వజ్ఞుడు షాఫ్‌నార్ సిద్ధాంతాలను విమర్శించే తాత్విక గ్రంథం అది.

"కష్టాలేవీ కన్నీటిబొట్టు విలువచేయవు. ఈ కన్నీరు కార్చేదీ, ఇత రులచేత కార్పించేదీ స్త్రీలే. కొందరు పైకేడుస్తారు, మరికొ దరు లోలోన ఏడుస్తారు మొత్తంమీద స్త్రీల కెప్పుడూ కన్నీటిధారలే ఆ కన్నీటి ప్రవా హానికి జన్మస్థానం ఏదో ఎవ్వరికీ తెలీదు ఆనందం, ఈర్ష్య విచారం, కోపం- ఉద్రేకం ఏదైనా, అది కన్నీటిద్వారానే వ్యక్తమౌతుంది. పిల్ల నదిలా ప్రారంభించి, కన్నీటి ప్రవాహం, యుగయుగాలుగా ప్రవహించి, వొడ్డును మెల్లగా కోస్తుంది. మానవుడు ఎంతో ఆప్యాయంగా చిన్ననాటి నుండి శ్రమపడి కట్టుకున్న ఆశాభవనాన్ని ముంచివేసేటంతటి వేగంగా

ప్రవహిస్తుంది చివరికి- జీవితానుభవంగురించి షాఫ్‌నార్ చెప్పిన నిర్వచనాలలో ఇవి కొన్ని.

షాఫ్‌నార్ 1788లో జర్మనీదేశంలో జన్మించాడు. కొంతకాలం హాంబర్గ్ పట్టణంలో ఒక వ్యాపారసంస్థలో క్లార్కుగా పనిచేశాడు కాని అతనిదృష్టి ఎప్పుడూ సాహిత్యం పైనా, వుద్యోగంపైన మరలుతూ వుండేది. అతని తండ్రి చనిపోయాడు అది సహజమైన చావుకాదని, ఆత్మహత్య చేసుకున్నాడని కొందరు చెప్పుకుంటారు. ఆ క్లార్కు వుద్యోగం విడిచేసి సాహితీవ్యాసాంగం కొనసాగించడం అతని తల్లికి ఇష్టమే. రచయిత్రిగా పలుకుబడి సంపాదించాలని ఆమె పరిషత్తులను సమావేశపరిచి శ్రమపడుతుండేది. శృంగారచేష్టలు చేసేది, ప్రేమకలాపాలు కొనసాగించేది తల్లి ప్రవర్తన అతనికి నచ్చలేదు. తరుచు తల్లీ కొడుకూ తగవులాడుకొనేవారు. స్త్రీలోకాన్ని చులకనచేసే అతని అభిప్రాయాలన్నీ తల్లిపై గల ద్వేషంనుండి బయలు దేరినవే ననుకోవచ్చు. ఫ్రాంక్‌ఫర్డ్ పట్నంలో ఉపన్యసిస్తూ తాత్విక రచనలుచేస్తూ, ముసలి బ్రహ్మచారిగా గడిపాడు. కాంట్, ప్లేటోల సిద్ధాంతాలు, ఉపనిషత్తులు అతన్ని ఎక్కువగా ఆకర్షించినాయి. అతని రచనలపై హిందూతాత్విక సిద్ధాంతాల ప్రభావం చాలావుంది. అతను పెంచిన కుక్కపేరు "ఆత్మ" గదిలో బుద్ధుని కంచుప్రతిమ వుండేది.

వాస్తువులను కామించిపొందడంలో కనబరచే పట్టుదలే మానవుడి కష్టాలకి కారణం అని షాఫ్‌నార్ వాదం.

పట్టుదలని విసర్జించినప్పుడు, మానవుడు ఆనందశిఖరం చేరుకుంటాడు. వాంఛ అనే సబ్బు బుడగని పెద్దదిగా వూదుతాం—అది చివరికి పగిలిపోతుందని తెలుసుండికూడా. మాయ ముసుగులా లోకంపైన పడుతుంది. దాన్ని తొలిగిస్తే ఇతరుల బాధలు మనవిగా కనబడతాయి సామభూతి ప్రేమలద్వారానే యీ మాయని తొలగించడం సాధ్యపడుతుంది. జ్ఞానమార్గంకంటె కర్మమార్గమే మానవుడికి ఆనందాన్ని సమకూరుస్తుందని అతని సిద్ధాంతం.

కళాశాల విద్యార్థిగా తత్వశాస్త్రం చదివి, బి. ఎ. డిగ్రీ సంపాదించుకున్నాడు కోదండరామయ్య. హిందూ తాత్విక సిద్ధాంతాలను పాశ్చాత్య సిద్ధాంతాలతో పోల్చి, సమన్వయపరిచే రచనలు అతనికి ఇష్టం. అనేకమంది ఒకే విషయం చెప్పడం చిత్రంగా వుంటుంది. కాబట్టి ఆ విషయంలో "సత్యం" వుండాలి. సంసారాన్ని సాగరంతో పోలుస్తారు.

"నేను ఒడ్డునున్న గులకరాళ్ళతో ఆడుకుంటాను—నా ముందు వున్నది మహాసముద్రం" అన్నాడు విజ్ఞానశాస్త్రజ్ఞుడు న్యూటన్.

"నిరంతర ప్రతిమ" చిత్రించాడు శిల్పి రోడిన్. నగ్నంగా ఒక కన్య వొళ్ళు విరుచుకుని, తల వెనక్కి వేళ్ళాడవేసి కూర్చునుండగా, ఒక ముదుసలి తన గడ్డాన్ని ఆమె స్తనాలమధ్య పోనిచ్చి, ఆమె పెదవులను వెదుకుతూవున్నట్లు చూపుతుంది ఆ రోడిన్ శిలావిగ్రహం. "ప్రతి స్వల్పమైన వస్తువూ ఏదో బాధపడుతూ వుంటుంది ఆ బాధలో మన సంతోషాన్ని కలపకూడదు" అంటాడు వర్డ్స్‌వర్త్ కవి.

తత్వజ్ఞుల సిద్ధాంతాలకంటే వారి జీవితగాథలు మరీ చిత్రంగా వుంటాయి. షాఫ్‌నార్ బోధనలో శాంతము, ఆధ్యాత్మికతృప్తి, నిరాడంబరము, స్వార్థత్యాగము, విశ్వమానవప్రేమ కనబడతాయి. కాని అతని నిత్యజీవితంలో వేరుగా దర్శనమిస్తాడు ఒకసారి వొక వృద్ధస్త్రీ తన గది ముందు బిగ్గరగా మాట్లాడుతోందని చిరాకుపడి, ఆమెని మెట్లమీద నుండి కిందికి త్రోసివేశాడట షాఫ్‌నార్. మృత్యువుపట్ల భయంపోగొట్టి జీవితం పట్ల అభిమానం, ఆశ రేకెత్తించ యత్నిస్తారు తత్వజ్ఞులు కాని షాఫ్‌నార్ రచనలలో నిరాశ, దుఃఖము ప్రబలంగా గోచరిస్తాయి వాటిద్వారా కన్నీటితో చెలిమి అలవడుతుంది. కోదండరామయ్యకి ఆ రచనలంటే అందుకనే యిష్టం. స్వాతంత్ర్య సమరోద్యమములో జేరి జైలులో గడిపిన రోజుల్లో ఆ సిద్ధాంతాలు ఎంతో మనశ్శాంతినిచ్చాయి. ఒక విధంగా అతని జీవితాన్ని బట్టిచూస్తే షాఫ్‌నార్ చెప్పినవేవీ నిజంకావు తన భార్య అనసూయ కంటతడిపెట్టగా అతనెప్పుడూ చూడలేదు. ఆమె పెత్తల్లికూతురు పోయినప్పుడు తన్నువొదిలి వెళ్ళడానికి యిష్టపడలేదు. రెండేళ్ళక్రితం ఆడపిల్ల పుట్టిపోయినప్పుడు కూడా ఆమె విచారించి కన్నీరు కార్చడం

అతనికి జ్ఞాపకంలేదు. అతని వేదాంతం చాలా భాగం ఆమెకూ అబ్బినట్లుంది. ఉన్నవాళ్ళుంటారు పోయినవాళ్ళు పోతారు, దానికి విచారం ఎందుకూ? పోయినపిల్లని జ్ఞాపకం చేసుకుని తను దిగులుపడినప్పుడు "ఎందుకండీ బెంగ! ఇహ మనకి పిల్లలుపుట్టరనా? అసలు మనకి పిల్లలెందుకండీ? హాయిగా ఇద్దరం వొంటిగా రామాయణ భాగవతాలు చదువుకుంటూ, కృష్ణా రామా అనుకుంటూ ప్రశాంతంగా జీవితం గడిపితే చాలదూ? ఈ దేశం జనాభా పెరిగిపోతూవుందని పెద్దలందరూ మొఱపెట్టుకుంటోంటె, తమకి లేరని బెంగపడడం సమాజంపట్ల అపచారంకాదూ?" అనేది మొత్తంమీద కాపరానికొచ్చిన నాలుగైదేండ్లలోనూ భార్య కంటతడి పెట్టగా అతనెప్పుడూ చూడలేదు. వైధవ్యంలో తన తల్లి గావించిన దురంతాలు స్మరించుకుని స్త్రీలనందరినీ మొత్తం ఆడిపోస్తుంటాడు షాప్‌నార్.

కోదండరామయ్య మళ్ళా గదిలో కెళ్ళాడు. దీపం ముట్టించాడు. కిటికీ తలుపు దగ్గరగా వేశాడు. దీపం వెలుగులో కన్నీరు నీటి గుంటలో ప్రతిబింబించిన నక్షత్రాలలా జారుతోంది. కన్నీరేనా? వ్రేళ్ళతో తడిమాడు. విస్పందేహంగా కన్నీరే. వేలు తడిసింది. ఎందుకంత విచారం? "అనుసూ, అనుసూ" అని ఆమెను మేలుకొల్పాడు.

ఉలిక్కిపడి లేచి, దుప్పటినే పమిటగా పైకి లాక్కుని కూర్చుంది దీపంకేసి వెర్రిచూపు చూసింది. ఆరిపోతున్న దీపంలా కళ్ళమీదికి కనురెప్పలు జారుతున్నాయి. జారకుండా బలవంతంగా కళ్ళు విప్పి చూపు నిలబెట్టింది. ఆవులింతలో వొళ్ళు వొంకరలు తిరిగింది, దించేసిన తెరచాప గుడ్డలాగా.

"ఎందుకు అనుసూ ఏడ్పు?"

"ఏడ్పా!"

'అవును...."

"నే ఏడ్చానా?"

"చూడు, ఇదంతా కన్నీరే" అని తన వేలిని కంట తడిలో ముంచి చూపాడు.

"నిజంగానా?" అని కొంగుతో కళ్ళని తుడుచుకుంది.

"ఎందుకు అనుసూ" అని ఆమె ముఖాన్ని తన చేతుల్లో తీసుకుని, నోటిని ఆమె కళ్ళపై ఆనించాడు.

"అదేమిటి—ఉప్పగా ఉంటుంది."

"వేళాకోళానికేంగాని ఎందుకు ఏడుపు?"

ఏమో—అసలు ఏడ్చినట్లే మీరు చెప్పేదాకా తెలియదు నాకు."

"ఏదో కారణం వుండాలి."

"నాకేం గుర్తురావడం లేదు కలేదానా వచ్చిందేమో?"

"ఏం కల?"

"నాకేం జ్ఞాపకం రావడం లేదు" అంది ఆవులింత మధ్యలో వచ్చిన చిరునవ్వు ఆపుకుంటూ.

"జ్ఞాపకం తెచ్చుకో. చెప్పకపోతే నాకు నిద్రపట్టదివాళ" అన్నాడు బింకంగా.

"ఓయబ్బ—అదంతా నిజమే కాబోలు:"

"నువ్వెందుకల్లా అనడం—నన్ను నువ్వు ఎరగవు గనకనా—నీ మనస్సు నాకు తెలుసు, నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాననే అనుకుంటున్నాను."

"మనస్సుని అర్థం చేసుకుంటారు బాగానేవుంది కాని, మీ రెప్పుడైనా నా అందాన్ని మెచ్చుకున్నారా?"

"ఇవాళ నువ్వు వింతగా మాట్లాడుతున్నావు. నీకేదో నన్ను గురించి వింతకలొచ్చి వుండాలి. అది చెప్పవూ?" అన్నాడు దీనంగా.

"ఏమో—ఏదీ స్పష్టంగా లేదు. అద్దంలో మొహం చూసుకుంటా నట—అద్దం పగిలివుంటుందిట బాబోయ్ అని కేకేస్తాను. ఎక్కడో పెద్ద మంట—నిప్పు—గుడ్డలు తగులడుతున్నట్లు—నిప్పుచుట్టూ తెల్లపొగ—మంట కనబడకుండా-మళ్ళా కేకేస్తాను తరవాత....తరువాత...."

మాటల కోసం తడుముకుంటూ దిండుమీద తల ఆనించింది.

"తరవాత....? ఇంకా జ్ఞాపకం చేసుకో."

"తరువాత....ఎవరికో పిల్ల పుట్టడం....అమ్మో! భయమేస్తుంది.

చుట్టూ మాయ ఎర్రగా, రక్తం అదీను—ఆ మాయమధ్య శిశువు గడ్డకట్టి వున్నట్లు,- ఆకారం కనబడదు"

"అదంతా మాయలాగుందండీ"

"పడుకోండి"

"మొహం కడుక్కో.. లే. మంచినీళ్ళు తాగి పడుకో."

అనసూయ లేచింది. మొహం కడుక్కొని తుడుచుకుని హాల్లో లైటు వేసి గోడనున్న అద్దంలో మొహం చూసుకుంది.

"ఇదేవిటండీ-ఈ అద్దంలో మొహం సరిగ్గా కనబడటం లేదు!" అని కొంగుతో అద్దం తుడిచింది.

"రాత్రిళ్ళు అందుకే అద్దం చూసుకోకూడదంటారు మనవాళ్ళు. ఆడది అసలే చూసుకోకూడదు."

అనసూయ మళ్ళా గదిలోకొచ్చి కిటికీ తెరిచింది. ఆవులించి పడుకున్నట్లు దీపం ఆరింది. "అమ్మయ్య" అని పడుకుంది అనసూయ.

## 2

మర్నాడు మరోమారు-రాత్రి కన్నీటికి కారణమైన ఉత్తరంతీసి చదివింది అనసూయ. బెనారస్‌నుండి ఆమె అక్క వ్రాసిన ఉత్తరం అది. ఆ ఉత్తరంలో ఆమెకు కావాల్సిన వాక్యాలు కొన్నే—

"....ఆనందం నిన్ను మరీమరీ అడిగానని వ్రాయమన్నాడు. ఇంట్లో ఎప్పుడూ తెగ అల్లరిచేస్తూ వినోదాలు, స్నేహితులు, షికార్లతో కాలం గడుపుతూవున్నా కూడా క్లాసులో మంచి మార్కులు ఎల్లావొస్తాయా అని మా అందరికి ఆశ్చర్యంగా వుంది ఇదివరకు అతని పెళ్ళిని గురించి వ్రాశాను. ఇప్పుడా సంగతంతా మారిపోయింది. ఆ సంబంధం నచ్చలేదని తిరగగొట్టేశారు. ఇంచుమించు నీలాంటిది దొరికేదాకా వివాహం చేసుకోనని భీష్మించుకొని కూర్చున్నాడు. మీకు ఇప్పట్లో ఇటుకేసి రావల్సినపని...."

ఆనందరావుని అనసూయ ఎప్పుడూ చూడలేదు-ఆమె అక్కయ్యకి అతను వరసకి మరది-అంటె భర్త పినతల్లి కొడుకు చిన్నప్పటినుండి బెనారస్‌లో అన్నగారితో వుండి చదువుకుంటున్నాడు.

సూరమ్మ-అంటే అనసూయ అక్క-వేసంగిలో పుట్టింటికి వొచ్చి

నప్పుడు ఎప్పుడూ ఆనందరావు కబుర్లే చెబుతుంటే అనసూయ శ్రద్ధగా వినేది. ఎప్పుడూ ఏదో అల్లరిచేస్తూ, నవ్వుతూ, ఇతరులను నవ్విస్తూ, బోలెడు కాలక్షేపం కలిగిస్తాడట అర్ధరాత్రి మంచంకింద దూరి దయ్యంలా ఇంట్లో వాళ్ళని జడిపిస్తాడట. అనసూయని అతను పది పన్నెండేండ్లక్రితం చూశాడు కాని యీమె అతన్ని చూడలేదు అనసూయని మళ్ళా పెళ్ళిలో చూశాడు. అప్పుడు కూడా ఆమె అతన్ని చూడలేదు. సూరమ్మ అతన్ని గురించి చెప్పినప్పుడల్లా అతన్ని చూడాలని కుతూహలపడుతూండేది. "ఈసారి వొచ్చేటప్పుడు అతన్ని మనింటికి తీసుకురావే" అంది చాలా సార్లు అనసూయ అక్క సూరమ్మతో. "అబ్బే, అతనురాడే. పరాయి వాళ్ళింటికి వెళ్ళడం అంటే చాలా సిగ్గుపడతాడు. చిత్రం వాళ్ళస్వంతింట్లో కూడా వొకొక్కసారి పరాయివాడిలా ప్రవర్తిస్తాడుట" అన్నది సూరమ్మ.

"నీ దగ్గర చనువేగా."

"ఐనా సరే అతను రాడే. ఈసారి తీసుకురమ్మని మీ బావతో నువ్వు చెప్పరాదు?"

"బావతో నే చెబితే బాగుంటుందా?"

"ఏం ఫరవాలేదు. నీ కింకా పెండ్లి కాలేదుగా" ఇద్దరూ నవ్వు కున్నారు.

ఈ సంభాషణ జరిగిన నెలరోజులకే ఆ వూళ్ళో ఏదో పనుండి ఆనందరావు తండ్రితో సహా వొదినగారి పుట్టింటి కొచ్చాడు. సాయంత్రం ఎనిమిదయింది. ఇంట్లో పెద్దలు పిల్లలు బోలెడు జనం వున్నారు. పిల్ల లంతా భోజనాలు చేసి పరున్నారు. అనసూయకూడా పడుకుంది. ఆనందం వచ్చిన సంగతి ఆమెకు తెలియదు. మండువా నందు పక్కగదిలో ఆనం దానికి మంచం వేశారు. భోజనమయ్యాక ఆనందం అల్లా తిరిగొచ్చి పదిం టికి తలుపుతట్టాడు ఎవరూ పలకలేదు. అనసూయ నిద్రకళ్ళతో ఎల్లాగో తలుపుతీసి మళ్ళా వెళ్ళి పరుంది. మెల్లగా గదిలోకి ప్రవేశించి దీపం కొం చం పెద్దది చేసి ఆమె ముఖం మీదికి ఎత్తి చూశాడు. ఆమెను చూసి మూడేళ్ళయ్యింది. ఈ మూడేళ్ళల్లోనూ ముఖంలో మార్పు కనబడింది—

ఆ సన్న వెలుగులో వెన్నెట్లో విప్పుకున్న మొగిలిపొత్తిలా చుట్టూ రేగిన జుట్టులోంచి ఆమె ముఖం విప్పారుకుంది వేళ్ళతో ఆమె బుగ్గలని తాకాల నుంది. అటూ ఇటూ చూసి ఒకసారి తాకాడు. మెత్తగా, వేడిగా తగిలాయి ఆమె కదిలింది....ఏదో స్పర్శ, కండ్లకి గంతిలు కట్టుకుని త్రాడనుకుని సర్పంపైన చెయ్యి వేసిన స్పర్శతో....కదిలి, సగం మూసిన కంటిని పూరిగా మూసింది. స్విచ్‌లో చెయ్యిపెట్టి షాక్ తిన్నట్లు చెయ్యిలాగేసి, వెళ్ళిపొయ్యాడు. తెల్లారగట్ట ఐదింటికే అనసూయ లేచింది. ఆ పల్చటి వెలుగులో నిద్రమైకంలో అతన్ని ఆమె సరిగ్గా చూడలేదు. పొడుగాటి వెంట్రుకలు ఉంగరాలుగా చుట్టుకుని మొహంలో చాలాభాగం కప్పివేశాయి. అంతవరకే యీమెకి గుర్తు. ఆరుగంటలకే తండ్రితో వెళ్ళిపొయ్యాడు ఆనందం.

మరో ఏడాది తర్వాత దసరా శెలవలకి సూరమ్మగారింటి కెళ్ళింది అనసూయ. అంతకు క్రితం రోజునే ఆనందం వాళ్ళ వూరు వెళ్ళిపొయ్యాడట.

ఆ పైయేడాదికి అనసూయ పెళ్ళి స్థిరపడింది. భర్త చాలా ఆస్తి, చదువు వున్నవాడు ఉద్యోగం దొరికే అవకాశాలున్నా స్వాతంత్ర్యోద్యమంలో పనిచేయాలన్న ఆతృతవల్ల, ఆ అవకాశాలను వొదులుకున్నాడు. అనసూయ పెండ్లికి ఆనందరా వొచ్చి వొక్కరోజున్నాడు. ఆమెకు మాత్రం, అతన్ని చూసే అవకాశం చిక్కలేదు. సాయంత్రం ఐదింటికి అక్కయ్య నడిగింది.

"ఆనందం వొచ్చాడుట— ఎక్కడున్నాడో.... నాకు కనపడ లేదు."

"ఏమో యీ జనంలో ఎక్కడున్నాడో.... విడిదిలో మేడమీద గ్రామఫోన్ పాటలు వింటూ కూర్చున్నాడు ప్రొద్దున నే వెళ్ళినప్పుడు" అంది సూరమ్మ.

మేడమీది విడిదిలో కెళ్ళింది అనసూయ. గదిలో భర్త కోదండ

రామయ్య, ఆనందం, యింకా ఎవరెవరో చాలా మంది వున్నారు. మాటలు వినబడ్డాయి. లోపలికెళ్ళకుండా తొందరగా వొచ్చేసింది.

## 3

ఇవన్నీ గడిచిన సంగతులు. అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చి, కొంత ఆనందాన్ని కొంత విచారాన్ని కలగచేస్తూంటాయి. భర్తతో రాజకీయాలవి గురించి కబుర్లు, వంట, సంసారం, చాకిరీ, రాత్రిళ్ళు వేదాంత గ్రంధాలు భర్త చదివి చెపుతూండడం.... మామూలుగా సాగిపోతోంది ఆమె జీవితం. బెనారెస్ నుండి సూరమ్మ ఉత్తరం కోసం ఎదురు చూడడం, ఉత్తరం రాకపోతే బాగుండదనుకోడం, ఆమె కొక రహస్యమైన అనుభవంగా తయారైంది. ఆ ఉత్తరంలో తప్పకుండా ఆనందం గురించి.... వొక్క వాక్యమైనా.... వుండి తీరుతుంది. "ఆనందం" అనే ఒక వ్యక్తి స్వరూపాన్ని ఊహలో నిర్మించుకుంది. అక్క ఉత్తరంలో విషయాలతో ఆ రూపానికి మెరుగులు దిద్దుతూ వుంటుంది. ఆమె మనస్సు ఒక పెద్ద భవనం.... అందులో అనేక గదులున్నాయి. వాటిల్లో ఒక దాంట్లో ఆనందం కాపురం వున్నాడు. అద్దెగిద్దె లేదు తలుపు తెరిచిచూస్తే, లోపల కనపడదు ఆనందం గూర్చి భర్తతో చెప్పే అవసరంలేదు. "ఏడి? చూపించు" అంటే, తను చూపలేదు. ఉన్నాడని చెప్పి ఏం ప్రయోజనం? తనకెక్కడో వొక స్వంత భవనం వుంది. అందులో తనక్కావల్సిన వ్యక్తి వొకడున్నాడు. ఎప్పుడో అద్దె యిస్తాడు. అల్లా అనుకోవడంలో ఆశవుంది. తను ధనికురాలు నన్న భావనతో వొచ్చే ధీమా, భవిష్యత్తుని ధైర్యంగా ఎదుర్కోగల సంతోషమూ వున్నాయి.

ఈ ఉత్తరాలు కొన్ని ప్రమాదకరంగా వుంటున్నాయి. రాత్రి ఆమెను కలవరపెట్టింది ఈ ఉత్తరమే. "ఇంచుమించు నీలాంటిది దొరికే దాకా అతను వివాహం చేసుకోనని...." మళ్ళా చదివి ఈ ఉత్తరం చింపి వేసింది అనసూయ. ఈ విశాల ప్రపంచంలో ఇన్ని కోట్ల మానవులలో తన చక్కదనాన్ని మెచ్చుకున్నది అతనొక్కడే. అతన్నెప్పుడూ చూడ లేదు. తను చక్కందని తెలుసు అనసూయకు. చాలామంది స్త్రీలలా అను కోడం దగాపడటం మాత్రమే కాకుండా, చక్కందన్న భావంపై గురి

కుదరడంలో వొచ్చే స్థైయిర్యం వుంది ఆమెలో. ఆమెలో కొత్తగా వొచ్చిన మనోధైర్యానికి, పట్టుదలకీ, ఈ నమ్మిక కొంత కారణం. అయినా అది చాలదు. ఆ విషయం ఇతరులు గుర్తించి, తాము గుర్తించినట్లు తనకు తెలియజేస్తే కాని ఆమెకు తృప్తి సమకూరేటట్లులేదు. అన్యులమాట అటుంచి, ఆమెభర్తే ఆమె చక్కదనాన్ని గుర్తించి, జోహారు పలికిన జ్ఞాపకంలేదు. లోపల ఆమె చక్కదనానికి అతను తృప్తి చెందినా, అది ఆమెకు తెలియపరచలేదు. చుట్టాలు, ఇరుగుపొరుగువారు, రూపంలో ఏదో లోపం చూపి దెప్పిపొడిచేవారూ, ఆక్షేపించేవారూను.

ఒకటి రెండుసార్లు భర్త "నీ కళ్ళు కొంచెం చిన్నవేమో అను కుంటా" అన్నట్లు జ్ఞాపకం. ఒకసారి పాతస్నేహితు డొకాయన వాళ్ళింటి కొచ్చి ఏదో మాటల సందర్భంలో.... "ఏరా కోదండం! నీ భార్యని ఎప్పుడూ చూపావుకాదు.... పెళ్ళికి శుభలేఖ పంపకపోతే మానె" అంటే "చూడతగ్గ విశేషం ఏమీ లేదులే". అన్నాడు భర్త. ఆమెకి అల్లాగనడం చిన్నతనంగా తోచింది.

"నా పెండ్లాన్ని చూశారా?" అని పదిమందికీ చూపకపోయినా, అడిగినప్పుడేనా, తనని గురించి చెప్పొద్దూ! ఇదొకరకం తృణీకరణ. అప్పటి నుండి ఆమెలో సడలిపోతున్న మనోనిబ్బరానికి, ఆనందం అవస రంగా కనిపించాడు. అతన్ని చూడడం, అప్పుడప్పుడూ అతని వద్దనుండి కాని, అతన్ని గురించి కాని ఉత్తరాలు చదవడం.... అంతే ఆమెకోరేది. ఆనందం ఆమెకి బంధువే. నిర్భయంగా అతన్ని తనింటికి రమ్మనొచ్చు. కాని అతనిమీద తను రహస్యంగా చూపే ఆప్యాయత, ఆదరణ, అతన్ని మరింత దూరంగా చేశాయి. అతన్ని గురించి అంతగా యోచించకపోతే, అతన్ని ఏనాడో ఆమె చూసి వుండేది. చించిన ఉత్తరం ముక్కలకేసి చూసింది.

"క్షమించు నీలాంటిదాన్ని...." "భీష్మించుకుకూ...." "మరి మరి అడిగానని వ్రా...." ఉత్తరం ముక్కలని కుంపట్లో పడేసింది అన సూయ.

## 4

రహస్య భవనానికి తాళాలు వేస్తుంది. తాళం చప్పుడు భర్తకి వినబడకూడదు. కొత్త ఉత్సాహం, సరదా తెచ్చిపెట్టుకుని, ఎప్పుడూ దిగులంటే ఏమిటో తెలియనిదానికిమల్లే భర్తతో కులాసాగా కబుర్లు చెప్పాల్సి వొస్తూంది. ఆ ఉల్లాసాన్ని అతని సంపర్కంవల్ల అబ్బిన మనోవికాసంగా భావించాడు కోదండరామయ్య. వారిరువురిమధ్యా ఆధ్యాత్మిక చింతన ఒక క్రొత్తబంధం. ఉభయులకూ చిన్నతనంలోనే అంతటి వైరాగ్యం అబ్బడం తమ అదృష్టంగా భావించి, ఆ మనశ్శాంతితో దేశసేవకు పూనుకున్నాడు. రెండేళ్ళు ప్రశాంతంగా గడిచాయి.

కాంగ్రెస్ సహాయ నిరాకరణోద్యమం కొనసాగుతున్న రోజులవి. దేశంలో ముఖ్యనాయకులంతా జైళ్ళలో వున్నారు. కోదండరామయ్యకు భార్యని ఈ కల్లోల వాతావరణంలోకి దింపడం యిష్టం లేదు. దెబ్బలు తగల్లేదుకాని కోదండరామయ్యకి ఆరునెల్లు కారాగారశిక్ష విధించారు. మర్నాడు వెళ్ళాలి.

"మీ వొక్కరూ వెళ్ళడం ఏం బావుంది. పోతే జైల్లోకి యిద్దరం పోదుంగ - నన్నెందుకు రానివ్వరుకాదు?" అన్నది. భర్త నవ్వాడు

"ఆరునెలలు ఇట్టె గడిచిపోతాయి. "ఇంటా బైటా" అని ఓ గ్రంథం వ్రాశాడు రవీంద్రుడు. భార్య ఇంట, భర్త బైట అని అనుకుందాం. ఆరునెలలు ఇట్టె గడిపి వొచ్చి నీ హస్తాలలో వాల్తాను. బైట జైలుకడ్డీలు. ఇంట భార్య హస్తాలనే కడ్డీలు. మొత్తంమీద జీవితాంతం భారతీయుడికి జైలే, రాసిపెట్టింది"

"జైలువల్ల దేశానికేం వుపకారం జరుగుతుంది? బైటుంటే ఏదైనా చెయ్యొచ్చు" అన్నది అనసూయ.

"నువ్వు నెలకి మూడురోజులు బైటుండి ఏం వుపకారం చేస్తున్నావో!" అన్నాడు వేళాకోళంగా. ఆమెని చేతుల్లోకి తీసుకోబోయ్యాడు. "ఈ జైలుకూడా ఎందుకులెండి" అని తప్పించింది అనసూయ.

## 5

భర్త జైలుకెళ్ళి రెండునెలలైంది. ఒంటిరిగా వుండటం కష్టంగానే వుంది. అట్లాగని వాళ్ళు వీళ్ళు వొచ్చివుండటం ఆమె కిష్టంలేదు. ఏదో అనుమానం, భయం, ఆశ, ఒక్కసారి ఆనందం రాకూడదూ? ఈ ఆలోచనలనుండి విముక్తి పొందడం కొసం వోవారం రోజుల్లో, జైలుకెళ్ళి భర్తను చూసివచ్చింది, అరవిందుని రచనలు చదువుకుంటున్నాడాయన. వాటిల్లో వున్నవాటికి ప్లేటో, హెగెల్, కాంట్ రచనల్లో పోలికలు సేకరించి ఒకవ్యాసం వ్రాస్తూ గడుపుతున్నాడు. "ఆకాశంలో పై కెగసిపోతున్న నక్షత్రం తన నీడని దిగనివదు,—తన వునికికి చిహ్నంగా, ఏ మచ్చా, కళంకమూ మిగల్చదు—తన వయస్సులో పెద్దపైన గుర్తు లగపడవు. అంత స్వచ్ఛంగా పరిణమించాలి జీవాత్మ—అట్లాంటి జీవాత్మ పరమాత్మలో ఐక్యం అయినప్పుడు, ఆ నక్షత్రంలాంటి పరిపూర్ణత సమకూరుతుంది." ఆ వాక్యం వినిపించాడు కోదండరామయ్య. అది "ఎమర్సన్" వ్రాసిందిట. ఏదో హామీ ఇస్తే విడిచిపెడతారుట బ్రిటిష్ ప్రభుత్వంవారు. హామీ ఇచ్చి ఇంటికి రాకూడదూ? అని అడిగింది భర్తని.

"నువ్వు చెప్పింది చూస్తే అగస్టయిన్ అనే ఒక పాశ్చాత్య యోగి పుంగవుడు చెప్పింది జ్ఞాపకం వస్తోంది ఆతను చిన్నతనంలో పాపాలు చేశాడుట దైవాన్ని తనకి బ్రహ్మచర్యం—పాతివ్రత్యం—ప్రసాదించమని ప్రార్థిస్తూ "ఇంక కొంతకాలం పొయ్యాక అవి ప్రసాదించండి" అని ముగించాడుట తనప్రార్థన. అల్లాగ, అప్పుడే జైలు విముక్తివొద్దు;కొంతకాలం అయ్యాక స్వరాజ్యం రావాలని కోరితేనేం!" అని నవ్వేశాడు కోదండరామయ్య.

భర్తనుచూసి ఇంటికి తిరిగి రాగానే బెనారెస నుండి సూరమ్మ వ్రాసిన రెండుఉత్తరాలూ చూసుకుంది అనసూయ.

"మీ ఆయనకున్న దేశభక్తి అందరికీ వుంటుందనుకోకు. లోపల నిజంగా లేకపోయినా, కొందరు బైటికి అల్లా కనబడాలని పైపైవేషాలేస్తారంటారు మా వారు. ఎందుకు చెబుతున్నానంటే, ఈమధ్య ఆనందం

ఖద్దరుకట్టడం ప్రారంభించాడు....” అది మొదటి ఉత్తరంలో భాగం.

“....వాళ్ళవూరు వెడుతూ ఆనందం మీ ఊళ్ళో దిగుతానన్నాడు. అక్కడ అతని స్నేహితులెవరో వున్నారట. మీ ఇంటికి వెళ్ళమని మరీ మరీ చెప్పాను బహుశ, అతన్ని నువ్వు గుర్తుపట్టలేవేమో జాగ్రత్త. చాలా సిగ్గుపడతాడు అందులోనూ నువ్వు ఒక్కదానవూ వున్నావంటే అసలే భయపడతాడు అక్కడికీ మన పిన్నికూడా అక్కడే వుందని చెప్పాను. ఎట్లా కనుక్కుని మర్యాదచేస్తావో జాగత! సిగ్గు పడతాడు, తను ఫలానా అని చెప్పడుకూడా....'' అది రెండో ఉత్తరంలో భాగం.

ఆనందం వస్తాడన్న ఉత్సాహంతో రోజులు వేగంగా గడిచిపోతున్నాయి. రోజూ మంచి దుస్తులు ధరించి—ఖద్దరువే—తలలో పూలు అమర్చుకొని రైలు చూచినతర్వాత భోజనానికి కూర్చునేది అనసూయ. ఆ రోజు మధ్యాహ్నం మూడింటికి పడుకునివుండగా క్రింది గుమ్మం తలుపు చప్పుడైంది. “ఎవరది?'' అంటూ క్రిందికి వెళ్ళింది. “మాట్లాడరేం'' అంటూ తలుపుతీసింది. పోస్టుజవాను ఉత్తరం యిచ్చాడు. కోదండరామయ్యదగ్గరనుంచి.

“దేశసేవకు పూనుకోవాలన్నవాడికి ఇంట్లో సరైన జీవితం వుండాలి. స్వంతవ్యవహారాలలో ఒడిదుడుకులు, ఇబ్బందులు, సమస్యలు ఉండకూడదు. భార్య సహకారం పూర్తిగా వుండాలి. వారిద్దరి అంతరంగిక జీవితాల్లోనూ ఇతరులతో పంచుకోడానికి వీల్లేని ప్రత్యేకమైన వ్యక్తిగతమైన దాపరికాలు ఉండకూడదని గాంధీగారు అంటూవుంటారు....''

మళ్ళా వీధితలుపు చప్పుడైంది. “తీసేవుంది” అంది అనసూయ మెట్లమీదనుండే. పెట్టి చేతబుచ్చుకొని ఒక నల్లటి వ్యక్తి లోపలికి ప్రవేశించాడు రుమాలుతో మొహం తుడుచుకుంటూ.

“ఏమండీ ఇదేనా కోదండరామయ్యగారి యిల్లు?'' అన్నాడు ఆ నల్లటివ్యక్తి.

“అవును, రండి.''

"ఆయన వున్నారాండీ?"

"ఆయన జైల్లో వున్నారు. నువ్వేనా ఆనందం" అని ప్రశ్నించింది.

"క్షమించండి" అని పెట్టె తీసుకొని వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

అనసూయ క్రిందికి దిగింది. తన ప్రశ్నకు సమాధానం చెప్పలేదా వ్యక్తి. ఆనందానికి సిగ్గు. ఫలానా అని చెప్పడు కూడా అని వ్రాసింది సూరమ్మ. ఇతనే అయివుంటాడు. భర్త యింట్లోలేడని రావడానికి జంకాడేమో ఒకవేళ. అల్లా వూళ్ళోకివెళ్ళి స్నేహితుల్ని చూసివస్తాడేమో! ఉంగరాల జుట్టూ—ఆ వ్యక్తి ఎక్కినబండీ సందుమళ్ళేదాకా చూసి తలుపు గడియవేసి మేడమీద గదిలో మంచంమీద పడుకుని నవ్వుకుంది. ఆనందాన్ని చూడాలన్న అభిలాష నశించింది. ఎంత నల్లగా ఎంత అసహ్యంగా వున్నాడు! వెంటనే సూరమ్మకి ఆనందం రాకనిగురించి ఉత్తరం వ్రాసింది అనసూయ.

"ఇత నింత కురూపికాబట్టే నువ్వెప్పుడూ ఇతనిని వర్ణించ లేదు" అని ఉత్తరం ముగించింది. ఈ వ్యక్తికోసం తను కలలో కన్నీరుకార్చి భర్త పెంచుకుంటున్న ఆశాలతని అందులో ముంచివెయ్యడం క్షమించరానిది. ఆవేశంలో అక్కకి వ్రాసిన ఉత్తరాన్ని చింపేసింది. సగం చదివి విడిచేసిన భర్త ఉత్తరాన్ని చివరంటా చదివింది.

"నువ్వు ఆరాత్రి ఎందుకు కన్నీరుకార్చేవో యిప్పటికీ అర్థంకావటంలేదు. ఆ దృశ్యం స్మరించుకున్నప్పుడల్లా ఏదో ఆందోళన. కాని ఒక్కమాట నొక్కి చెప్పగలను. మనం నిద్రావస్థలోనూ కలలోనూ అనుభవించే ఆనందం కాని, విచారంకాని వాటికి సంబంధించిన ఆలోచనలను కాని యధార్థజీవితంలో నిత్యకృత్యాలకి అన్వయించేటందుకు ప్రయత్నించేస్తే జీవితం అర్థశూన్యంగా పరిణమిస్తుంది. ఊహా ప్రపంచంలోని భావాలని పట్టుకొని ఈ సంసారసాగరాన్ని ఈదులాడేయత్నం ఇసుక ఎడారిలో మోటారు ప్రయాణంగా పరిణమిస్తుంది...."

ఆ ఉత్తరంలో "ఆనందం" అనేమాటని వాడాడు భర్త. అదొకటే ఆమెకు నచ్చలేదు.

## 6

అనసూయ కట్టుకొన్న ఊహాభవనం గదుల తాళాలన్నీ తీసి చూసింది. అన్నీ ఖాళీగానే వున్నాయి, ఒక్కగది తప్ప. ఆ గదితాళం రాదు. భర్త యింటికిరాగానే అతవి దగ్గరవున్న తాళంచెవితో ఆ గది తలుపు తెరవొచ్చునేమో చూడాలి. అది రాకపోతే తనూ, భర్తా ఇద్దరిబలం వినియోగించి తలుపులు వూడగొట్టాలి. జైలుశిక్ష పూర్తి అయిన తర్వాత కోదండరామయ్య యింటికి వచ్చాడు. విడిగా వున్నప్పుడు ఏమేం జరిగిందీ ఏమేం చేసిందీ, కష్టం సుఖం చెప్పుకున్నారు.

"ఏమండోయ్, మర్చిపోయాను. ఒకరోజున ఆనందరావు మనింటి కొచ్చాడు." అంది అనసూయ.

"ఆనందరావు ఎవరు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఆ అదే, మా అక్కయ్యకి వరసకి మరిది అవుతాడు లెండి. నల్ల కోతిలాగ వుంటాడు. చాలా సిగ్గు. లోపలికి రమ్మంటే రాడు."

"అదేమన్నముక్క. కోతుల్లో ఎర్రవికూడా వుంటాయి భోజనానికి వుండమనలేకపోయావా?" అన్నాడు.

"ఏమోసుమాండి. నా కేమంత మర్యాదచేయదగ్గ పెద్దమనిషిలాగ కనపడలేదు. మీరుంటే మర్యాదచేద్దురేమో. ఆ రంగు ఆ వాలకం, మీరు తీసుకొచ్చారే పట్నంనుంచి, దెయ్యంలాటి ఆ నల్లపూలతొట్టి- అల్లా వున్నాడు." అని విరగబడి నవ్వింది. ఇందులో అంతగా నవ్వడాని కేమీ కనపడలేదు కోదండరామయ్యకి.

అనసూయకంట నీరెట్టడం అత నెరగడు. పళ్ళన్నీ బయటపడే టట్లు నోరంతావిప్పి అల్లా నవ్వడమూ అత నెరగడు. ఆమె బుగ్గలు కొంచెం పెద్దవీ, కళ్ళు కొంచెం చిన్నవీ అవడంచేత నవ్వితే కళ్ళు మరీ చిన్నవవుతాయని ఆమె స్వేచ్ఛగా నవ్వదని కోదండరామయ్య దొంత సిద్ధాంతం. ఆ సిద్ధాంతం తప్పని ఋజువుచేస్తూ అల్లా నవ్వడం అతని కర్థంకాలేదు,

"ఎందుకు అనసూయా అంత నవ్వు?"

"ఏమో!"

ఈ ఆడవాళ్ళతో ఏదొచ్చినా చిక్కే- అనుకున్నాడు కోదండ రామయ్య.

## 7

రెండునెలలు గడిచాయి. రాత్రి వెన్నెట్లో చాపేసి పడుకుంది- అనసూయ. ఏవేవో ఆలోచనలు. ఏడ్పొస్తోంది తలచుకుంటే. కాని పైకి ప్రకటించేది నవ్వుమాత్రమే. అది మరీ నవ్వొస్తుంది. పైకి నవ్వేసింది. మెట్ల మీదనుంచి పైకి వస్తూ కోదండరామయ్య ఆ నవ్వు విన్నాడు.

"నువ్వు ఒక్కదానివేనా? నవ్వు వినబడితే ఇంకెవరో ఉన్నారనుకున్నాను. ఎందుకా నవ్వు?" అన్నాడు.

ఇంకా నవ్వుతోంది అనసూయ ఆనంద భాష్పాలు వెన్నెట్లో మెరిశాయి. రెండువేళ్ళుచూపి "పట్టుకోండి" అంది. అతను ఒక వ్రేలు పట్టుకొన్నాడు. "పొరపాటు" అంది. "రెండువేళ్ళూ పట్టుకోవాలి. తెలిసిందా? అందుకూ నవ్వు" అన్నది.

"అమ్మదొంగా, ఆదాసంగతి!" అతని పట్టు విదిలించేసి నవ్వుకుంటూ అనసూయ క్రిందికి దిగిపోయింది.

## 8

ఆరుమాసాలు గడిచాయి. ఆరోజున కోదండరామయ్య తండ్రికి జబ్బుగావుందనీ, వెంటనే రావలసిందనీ, ఉత్తరం వచ్చింది. అతని తండ్రి వుంటున్నది ఒకపల్లెటూరు. అక్కడికి ఇరవైమైళ్ళలోపు. కారుమీద వెళ్ళవచ్చు. అనసూయకూడా ప్రయాణమయింది. ప్రొద్దున్నే వెళ్ళడానికి కారుని కూడా మాట్లాడివుంచాడు కోదండరామయ్య. మర్నాడు వుదయం కోదండ రామయ్య వూళ్ళోకి వెళ్ళాడు. తొమ్మిదింటికి పోస్టు జవాను వుత్తరం యిచ్చాడు. అది బెనారెస్‌నుంచి సూరమ్మ వ్రాసింది.

"ఇదివరకు ఆనందం మీవూరు వస్తాడని వ్రాశాను. ఎందుకు రాలేదో రాలేదుట. రాలేకపోయినందుకు నీకు క్షమాపణ తెల్పమన్నాడు.

సరే ఎల్లానూ వస్తానన్నాను కదా అని మొన్ననే ఇక్కడనుండి బైలుదే రాడు. ఈవుత్తరం అందే సైముకు అతను మీఇంటికి వచ్చేవుంటాడు. చాలా జాగర్తగా చూడాలిసుమా. సిగ్గుపడతాడు. నిన్ను చూడాలని మరీ మరీ...."

వీధితలుపు చప్పుడు. కోదండరామయ్య కారులోంచి దిగాడు. ఇది వరకొచ్చిన నల్లటివ్యక్తి ఆనందరావు అనుకొని అతనిమీద ఆమెకున్న పూర్వ గౌరవ భావం చంపుకొని అతన్ని గురించి భర్తతో చెడుగా చెప్పి నందుకు విచారించింది అనసూయ.

"నేనివ్వాళ రాను. మీ రెళ్ళండి, నా వొంట్లో బాగాలేదు. పొద్దుట నుంచి తలకాయనొప్పి" అంది తలమీద చేతులుమోపి.

"వస్తానని తీరా ప్రయాణం అయ్యాకగా— ఆ వుత్తరం ఎక్కడ నుంచీ?"

"మా అక్కయ్య వ్రాసింది. దానికి కడుపులోనొప్పట్లూ ఆపీ వస్తున్నా యిట. ఏముంటాయి సంగతులు, అందరికీ జబ్బులేగా!" అంది విసుగ్గా.

"దానికేంలే, నువ్వు ప్రయాణం కావాలి-వూరికే కారులో కూర్చొని నిద్రపో. నిన్నక్కడ దిగబెట్టి, విషయం తెలుసుకొని డాక్టరుకోసం మళ్ళా ఈ వూరు ఎల్లానూ రావాలిగా. లే, లే," అన్నాడు కోదండరామయ్య సామాన్లు బంట్రోతుకు అందచేస్తూ.

"నేనిప్పుడు రాలేనండీ, ఆయాసంగావుంది. ఈస్థితిలో నేను రావడం మంచిదికాదు! ఏమంటారు? కాసేపు రెస్టుతీసుకుంటే తగ్గిపోతుంది. సాయం త్రమేనా, పొద్దున్నేనా కారు పంపండి." అంది అనసూయ.

"అవునవును. ఎవిమిదో మాసం కదూ!" అని నౌకరుతో ఇంటికి కావలసిన ఏర్పాట్లు చేసి కార్లో వెళ్ళిపొయ్యాడు కోదండరామయ్య.

ఒక గంట పడుకుని లేచింది అనసూయ. స్నానం చేసి భోజనం

చేసి అద్దం ముందు జడ సరిగ్గా అల్లుకుంటూ కూర్చుంది. తలుపు చప్పుడైనప్పుడల్లా లేచి వెళ్ళి చూసి వచ్చేది.

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. కాస్సేపు పడుకుంది. మళ్ళా లేచింది. కాఫీ తయారుచేసి తనుత్రాగి కొంత ఫ్లాస్కులో పోసి గదిలో బల్లమీద పెట్టింది. ఆ బల్ల గుడ్డ మార్చింది. దానిమధ్య నల్లపూలతొట్టి అమర్చింది. నాలుగు దాటింది. ఏదో చప్పుడైంది. మెట్లు దిగడంలో జారి పడిన గులాబీపువ్వును తీసి జడలోపెట్టి తలుపుతీసింది. చిన్న సూట్‌కేస్ చేతిలో వుంచుకొని ఒక వ్యక్తి ప్రవేశించాడు.

ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు.

"ఆనందా?" అంది చిరునవ్వుతో.

"ఆ" అన్నాడు.

"రా. పైకి రా. ఆ సంచీ అక్కడ వుంచు. అంతచిన్న సంచీ తీసుకొచ్చావేం?" మెట్లు ఎక్కుతున్నారు.

"ఈ సంచీ దగ్గరుండాల్సిందే."

చదువు పూర్తయిందా? ఏం వుద్యోగం చేస్తున్నాడు? ఏం పని మీద రావడం, లాంటి కుశలప్రశ్నలు కురిపించింది. సమాధానానికి అతనికి అవకాశం ఇవ్వకుండానే గదిలో కుర్చీమీద కూర్చున్నాడు, ఆమె మంచం కోడు పట్టుకొని నిలబడింది. తల వంచుకొని మాట్లాడుతూవున్నా అనసూయ అతనికేసి చూస్తూనే వుంది. మెదడులేని శరీరాలు చేసే ధ్వనులలా పరిణమిస్తోంది వారి సంభాషణ. ఏం ప్రశ్న వెయ్యాలో ఏం సమాధానం చెప్పాలో ఎవ్వరికీ తెలియడం లేదు. కాఫీ కప్పులో పోసి యిచ్చింది.

"మా యింటికి పొరబాటున వచ్చినట్టున్నావ్" అంది.

"అబ్బే, లేదండీ, పనుండబట్టే వచ్చాను, అయనేరీ?" అన్నాడు.

"అవును. నాతో నీకేం పనుంటుందిలే" అంది గోడ పైకి చూస్తూ. అతను ఆకర్షణీయంగానే వున్నాడు. చామన ఛాయ. పొడుగాటి ముక్కూ, పల్చటి ఖద్దరు లాల్చీ, మీసాలు లేకపోయినా ఎవరూ వ్యాఖ్యానం చేసే టంత వికృతంగా మాత్రం లేదు.

"కోదండరామయ్యగారేరీ?"

"మామగారి జబ్బుగా వుంటే చూడ్డానికి వెళ్ళారు"

"వెళ్ళాలనడం నాకు తెలుసు. అప్పుడే వెళ్ళిపోయారా? మీరు వెళ్ళ లేదేం?"

అనసూయ కొంటెగా చూసింది. మామగారికి జబ్బుగా వుందని అతని కెట్లా తెలుసు? భర్త సూరమ్మకి వ్రాస్తే, సూరమ్మ ఇతనితో చెప్పిందా!

"అదే, నువ్వొస్తావని వ్రాసింది. అట్లాంటప్పుడు— ఎంతో కాలం నుంచి నన్ను గురించి స్మరించుకుంటున్నావా, అంతమాత్రమేనా కాచుకుని వుండొద్దూ" అన్నది.

అతను నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

"నువ్వెప్పుడు పెళ్ళి చేసుకుంటావ్? సంబంధాలేవీ నచ్చటంలేద టగా" అంది మళ్ళా, తనలాంటిది దొరికేదాకా చేసుకోనని అతనిచేత అని పిద్దామని,

"నాకు పెళ్ళేమిటండీ! డబ్బుంటే చదువులేదు చదువుంటే డబ్బు లేదు. ఒకదాని కొకటి అతకడం లేదు" అన్నాడు.

"పోనీ ఎట్లాంటివాళ్ళు నచ్చుతారు నీకు?"

"ఇప్పుడా విషయం ఎందుకులెండీ-ఆయన మళ్ళా ఎప్పుడొస్తారు? ఈ సంచీలో డబ్బుంది. ఇదిగో చూడండీ...."

వీధి తలుపు చప్పుడైంది. ఆమె కోసం భర్త కారులో వొచ్చాడేమేనని కంగారు పడింది. ఆనందరావు ఇది వరకే వచ్చినట్లు చెప్పి అతని రూపాన్ని పరిహసించిన విషయం గుర్తు కొచ్చింది. ఇప్పుడీ అసలు ఆనం దరావుని చూసి అతనితో ఎందుకు ప్రయాణం అవలేదో గ్రహించి అను

మానపడి తీరతాడు భర్త. ఆనందరావుని కాసేపు ఎక్కడేనా దాగమని చెప్పి, భర్తకీ విషయం తెలియకుండా ఏదో చెయ్యాలి. తలుపుతియ్యగానే భర్త మేడమీదకొచ్చి తిన్నగా గదిలోకే ప్రవేశిస్తే! తన మనస్సులోని బాధని, సమస్యలనీ ముందు ఆనందానికి తెలియజెయ్యడం ఎట్లా? ఈ సందర్భాలన్నీ అతనితో చెప్పేటందుకు అవకాశం లేదు.

"నువ్వు దొడ్డిలోకెళ్ళి నూతి వెనక వసారాలో కాసేపు దాగి వుండాలి. మా ఆయ నొచ్చాడు." అన్నది అనసూయ మాటలను పూర్తిగా వుచ్చరించకుండా.

"ఆయన వచ్చారా! ఇకనేం, నాకు కావలసిందే అది" అన్నాడు ఆహ్లాదంతో.

"కాదు. నీకు తెలియదు. ఆయన అనుమానపడతారు. అదంతా చాలావుందిలే. నువ్వు దాక్కోక తప్పదు."

"నేను దాక్కోటమెందుకు? నేనేమి అపచారం చేశాను?"

"ముందు నువ్వు లేవాలి. లేకపోతే నాకు చాలకోపం వస్తుంది" అని అతని బుజాలని పట్టుకుని లేవనెత్తబోయింది.

"ఇదేమిటండీ, దాక్కోమంటారేమిటి? ఇదేం కర్మ!"

"నువ్వు కదులుతావా, కదలవా?" అని గర్జించింది.

కదలనన్నట్లుగా తలూపాడు. బల్లమీద వున్న నల్లపూలతొట్టెను ఎత్తి అతనిమీద విసిరింది. అతను కుర్చీలో వ్రాలిపోయాడు. గబగబా బయటకెళ్ళి అతనున్న గదికి తాళం పెట్టి క్రిందికి వెళ్ళి తలుపుగడియ తీసింది. తీరాచూస్తే నౌకరు. 'రాత్రి కాపలాకి రావాలో లేదో' కనుక్కోడానికి వచ్చాడు. అక్కర్లేదని చెప్పి మెట్లమేద వాలిపోయింది అనసూయ. తను ఘోరం చేసింది. మనస్సు కుదుటపడటం లేదు తన నిమిత్తం లేకుండానే కలలో కన్నీరులా కళ్ళమ్మట కన్నీరు జారుతోంది. వెళ్ళి గది తాళం తీసింది. ఆ వ్యక్తి లేచి దొడ్లోకెళ్ళి నీళ్ళతో, నుదురు తడుపుకొని రుమాలు తలకి చుట్టి వీధిగుమ్మంకేసి నడుస్తున్నాడు. కళ్ళమ్మట కారే నీళ్ళని తుడుచుకుంటూ అతన్ని వెంబడించింది అనసూయ.

"నన్ను క్షమించు. ఇల్లా చేద్దామనుకోలేదు పొరబాటు—చాలా పుందిలే సంగతి—ఈ రాత్రికి ఇక్కడ నువ్వు నే చెప్పేది వినాలి."

ఆ వ్యక్తి తనసంచీ తీసుకొని బయటకి నడిచాడు.

"ఇవ్వాళ వుండవూ? నే చెప్పేది వినవూ?" అతను వెళ్ళిపొయ్యాడు. తలుపుముయ్యకుండానే మేడమీదకెళ్ళింది అనసూయ. ఎనిమిది కావస్తోంది పగిలిన పూలతొట్టి ముక్కలన్నీ కుప్పగా పోగుచేసి మూలకి నెట్టింది. అక్కడక్కడ చిందిన రక్తంబొట్లని గుడ్డతోతుడిచి శుభ్రంచేసింది ఆ గుడ్డని దూరంగాతీసుకెళ్ళి అగ్గిపుల్ల ముట్టించి అంటించింది. మంటరేగి పొగకమ్మింది. దట్టమైన పొగలో మంట కనబడటం లేదు. గుడ్డకాలింది. పొగనుంచి తప్పించుకొని మంచం దూరంగా లాక్కొని పరుంది. ఎనిమిది దాటింది. ఇంటిముందు కారునిలిపి మేడమీద భార్యని వెదుకుతూ వెళ్ళాడు కోదండరామయ్య. ఆమె గదిలోలేదు. ఆరు బయట మంచంమీద పడుకొనుంది. అక్కడ దీపం లేదు గదిలో దీపం వెలిగించి, బయటికెళ్ళి ఆమె మొహంమీదకెత్తి చూపాడు. కనురెప్పల క్రిందనుంచి కన్నీరు ముత్యాలలాగ కారడం కనిపించింది. చకితుడయ్యాడు కోదండరామయ్య.

"అనసూయా! లే. కారొచ్చింది, లే, ఎందుకేడుస్తున్నావ్?" అని ఆమెను కదిపిలేపాడు. ఆమే లేచికూర్చుంది. కొంగుతో కళ్ళుతుడుచుకుంది.

"ఏడ్చానా? కల ఏమన్నా వచ్చిందేమో."

"ఎందుకు ఏడుపు? ఏం కలా? చెప్పవూ?"

"వంట్లో బాగాలేదు. నాకేం గుర్తులేదు."

మెట్లు దిగుతున్నారు ఇద్దరూ.

"వెళ్ళేప్పుడు నీతో చెప్పలేదు. ఆనందాచారని వొకాయన్ని డబ్బు తీసుకురమ్మన్నాను. ఈ ప్రయాణానికి డాక్టర్లకీ అవసరం వుంటుందని. వచ్చాడా?"

సమాధానం ఆలోచిస్తోంది అనసూయ. ఇంక నాలుగైదు మెట్లున్నాయి. "మెల్లిగా నడు" అని ఆమె భుజంపైన చెయ్యివేసి దింపుతున్నాడు కోదండరామయ్య.

"మీ నాన్నగారి కెట్లావుంది?" అంది నీరసంగా.

"ప్రమాదంలేదు. నాలుగురోజుల్లో నయమౌతుంది. నీ వొంట్లో ఎట్లావుంది? ఫర్వాలేదులే. అక్కడికి వెళ్ళగానే మందు పుచ్చుకుందువుగాని. డాక్టరు కారులో వున్నాడు. అతనూ వున్నాడు కారులో. మనం అక్కడ వుంటామని అక్కడికి వెళ్ళాడుట. మళ్ళా నాతోవొచ్చాడు—అందరం కలిసి కాళ్లో వెడదామని, మీ బంధువుట-ఆనందరావు...."

చీర కాళ్ళల్లో మడతపడినట్లు ముందుకు తుళ్ళిపడి మెట్లమీదనుండి అడ్డంగా దొర్లి నేలమీదపడిపోయింది అనసూయ. పెద్ద కేకపెట్టింది. కారులోవున్న డాక్టరూ, ఆనందరావూ లోపలికొచ్చారు. ఆమెను కారులోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి హాస్పిటల్‌కి జేరవేశారు. నెలలు పూర్తవకుండానే ఆడశిశువుని కన్నది అనసూయ. ఎర్రటిమాయలో ముద్దకట్టిన శిశు కళే బరం. తల్లికేం ప్రమాదం జరగలేదు. అనసూయ కలలో చూసిచెప్పిన విషయాలు స్మరించుకొన్నాడు కోదండరామయ్య. ఎన్నాళ్ళనుంచో యత్నిం చినా జ్ఞాపకంరాని గీతలో శ్లోకం చటుక్కున స్ఫురించింది.

శ్లో॥ ధూమేనావ్రియతే వహ్నిర్యథాఽఽదర్శో మలేనచ,
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్.

ఈ శ్లోకం తా నిదివరలో అనసూయకి చదివి వినిపించాడు. పొగ చేత ఎట్లు అగ్ని కప్పబడునో, మురికిచేత అద్దము ఎట్లు కప్పబడునో, మావిచేత శిశువు ఎట్లు కప్పబడునో అట్లు కామముచేత జ్ఞానము కప్పబడి వున్నది—అన్న శ్లోకార్థాన్ని కొద్దిగా మార్చి "అట్లు పురుషుడు స్త్రీ చేతా కప్పబడివున్నాడు" అని వ్యాఖ్యానించినప్పుడు అనసూయ నవ్వినదృశ్యం అతని కీనాడు ఆనందాన్ని సమకూర్చింది. కనురెప్పలకింద జారిన కన్నీరు కూడా అంతటిమాయే. ఈ భావం పాశ్చాత్య తత్వజ్ఞుల రచనలలో వున్నది కాని. గీతలో వాడిన ఆ మూడు వుపమానాలు వాటిల్లో చెప్పబడినట్లు అత నికి గుర్తులేదు. "చూడాలి. అట్లాంటివెవరేనా వాడారేమో." లీబ్‌నెజ్ స్పైనోజా రచనల్లో దొరకొచ్చు. యథార్థజీవితం మాయ అన్నదానికి తార్కాణం కలలో జారిన కన్నీరు.